క్లుప్తంగా

కేంద్ర మంత్రికి వినతి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

హత్నూర(సంగారెడ్డి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కుపై కేంద్రం చట్ట సవరణ చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌ను సోమవారం ఎస్టీటీయూ రాష్ట్ర కమిటీ తరపున వినతి పత్రం ఇచ్చినట్లు జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు పై పార్లమెంటులో సవరణ తెచ్చి ఎస్టీటీ, పీఎస్ హెచ్ఎంలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించే విధంగా చట్ట సవరణ చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరడం జరిగిందన్నారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మధుసూదన్ రావు, రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఉబచెరువు పేరు మార్చాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): వినాయక విగ్రహాలను ఉబచెరువు కట్ట వద్ద నిమజ్జనం చేస్తున్నందువల్ల ఆ ప్రాంతాన్ని వినాయకసాగర్‌గా పేరు మార్చాలని సోమవారం సామూహిక గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యవర్గ సభ్యులతో పాటు హిందూ సంఘాల నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణశివరాజ్‌పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్, చింతా గోపాల్, చౌదరి ప్రకాశ్, పవన్‌కుమార్‌గౌడ్, శివరాజ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

సొంతఖర్చుతో పొదల తొలగింపు



జేసీబీతో తొలగిస్తున్న పొదలు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీలోని 4వ వార్డులో ఇళ్ల మధ్య ఖాళీస్థలంలో ఉన్న దట్టమైన పొదలు, పిచ్చిమొక్కలను సోమవారం ఎస్ఆర్ఐ జీఎమ్మార్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చందర్ సొంత ఖర్చుతో తొలగింపజేశారు. అభయాంజనేయస్వామి ఆలయం వద్ద కాలనీవాసులు ఏర్పాటు చేసిన వినాయక మంటపాన్ని ఆయన సందర్శించగా కాలనీవాసులు పొదలు, పిచ్చిమొక్కలతో విషకీటకాలు సంచరిస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. తొలగింపునకు హామీనిచ్చి తొలగింపజేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, రవీందర్ నాయక్ దగ్గరుండి పర్యవేక్షించారు. వాటిని తొలగించడంతో కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మశ్చందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలి

నారాయణఖేడ్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండలాధ్యక్షులు సిందోల్ దశరత్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 1948 సెప్టెంబరు 17న సర్దార్ వల్లబాయ్ పటేల్ చేపట్టిన పోరాటం ఫలితంగా తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ప్రభుత్వం అధికారికంగా విమోచన వేడుకలు నిర్వహించకుండా ప్రజాపాలన దినోత్సవాన్ని ప్రకటించడం ఎంఐఎం నాయకులను తృప్తి పర్చడం కోసమేనన్నారు. సర్దార్ పటేల్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో సైతం ఏర్పాటు చేయాలన్నారు.

సంజీవన్‌రావుపేట్‌లో దిండి



భక్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేట్‌లో అఖండహరినామ సప్తాహంలో భాగంగా సోమవారం పాండురంగ విఠలేశ్వరుడి దిండి కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులతో కలిసి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, మండల సాయిరెడ్డి, ఎంపీటీసీ భూపాల్ తదితరులు ప్రత్యేక పూజలు చేసి భజనకీర్తనలు చేస్తూ గ్రామంలో దిండి పాదయాత్రలో పాల్గొన్నారు.



పటాన్‌చెరు టౌన్: ప్రత్యేక పుష్పాలంకరణలో గణేశ్‌గడ్డ గణనాథుడు



సదాశివపేట(సంగారెడ్డి): రాఘవేంద్రనగర్ కాలనీలో పూజలో పాల్గొన్న భక్తులు



హత్నూర(సంగారెడ్డి): దౌల్తాబాద్ చౌక్ గణనాథుని నిమజ్జనం

వైభవంగా వినాయక నవరాత్రులు

జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పలు గ్రామాల్లో గణపతులను డోలు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. భక్తులు లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.



జహీరాబాద్ టౌన్: గణనాథులను దర్శించుకుంటున్న గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డి



కల్హేర్(నారాయణఖేడ్): బాచేపల్లిలో శివపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



సంగారెడ్డి : లక్షా 85వేలకు వినాయకుడి లడ్డూ దక్కించుకున్న నారాయణ

చెరువు నుంచి సాగు నీరు విడుదల



మార్డి పెద్దచెరువు నుంచి సాగు నీరు వదులుతున్న కాంగ్రెస్ నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మార్డి పెద్ద చెరువు నుంచి సోమవారం సాగు నీరు విడుదల చేశారు. ఆయకట్టుకు నీరు సక్రమంగా చేరేందుకు ముందుగా కాల్వలో పూడిక తీసి శుభ్రం చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ఆదేశాల మేరకు పెద్దచెరువు నుంచి నీటి విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, చొమ్మల రాములు ప్రధాన తూము ద్వారా కాల్వలోకి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



సంగారెడ్డి: మజీద్‌లో భక్తులు

వట్‌పల్లి(అందోల్): మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా సోమవారం వట్‌పల్లిలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా శాంతి ర్యాలీ నిర్వహించి దర్గాలో మత పెద్దలతో కలిసి అందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా పార్టీల నాయకులు ముస్లింలకు ఈద్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ కుతొబ్దీన్, మొయిన్, గులాం రసూల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి: పట్టణ కేంద్రంలోని జామ మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మత పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వంట గ్యాస్ రాయితీ పత్రాల పంపిణీ



రాయితీ పత్రం అందుకున్న అవ్వ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ రాయితీ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అభయహస్తంలో భాగంగా మహాలక్ష్మి పథకం కింద వంట గ్యాస్ సిలిండర్‌కు రూ. 500 రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రెండు రోజులుగా పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, హమాలీకాలనీ, ఐడీఎస్ఎంటీ కాలనీ, బాగారెడ్డిపల్లి, గడి, అహ్మద్‌నగర్, శాంతినగర్ తదితర వార్డుల్లో మెప్మా సిబ్బంది లబ్ధిదారులకు రాయితీ పత్రాలను అందజేస్తున్నారు.

నిమజ్జనానికి పటిష్ట భద్రత



పటాన్‌చెరు టౌన్: గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు పటాన్‌చెరు సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని సాకి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ... మండపాల నిర్వాహకులతో సమన్వయంతో నిమజ్జనానికి తరిలేలా చూడాలన్నారు. డీజే అనుమతి లేదన్నారు. శోభాయాత్రను మధ్యాహ్నం ప్రారంభించి, రాత్రి 12 గంటల లోపు పూర్తి చేయాలన్నారు.

పంట నష్టం వివరాల సేకరణ



పత్తి పంట వివరాలను సేకరిస్తున్న ఏఈఓ నిఖిత

మునిపల్లి(అందోల్): వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, రహీమా, స్నేహ, నిఖిత, ఆంజనేయులు.. మండలంలోని ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంట నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు. సోమవారం తాటిపల్లి, పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, కంకోల్, బుదేరా, మల్లికార్జునపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. ఎన్ని ఎకరాల్లో పంట నష్టం జరిగిందో సర్వే నంబర్లలోని ఎకరాలు, పట్టాపాస్‌బుక్, ఆధార్ నంబర్, బ్యాంక్ పాస్‌బుక్ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

మునిపల్లి(అందోల్): మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా మల్లిక బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మునిపల్లి మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పని చేసిన భాస్కర్‌రెడ్డి హత్నూర మోడల్ స్కూల్‌కు బదిలీ అయ్యారు. పలువురు సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా మోడల్ స్కూల్‌లో జాయిన్ అయ్యారు.

సమస్యలు పరిష్కరించండి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కార్పొరేటర్ పుష్ప సోమవారం ఆయన నివాసంలో కలసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పోస్ట్ కార్యాలయాన్ని తీసివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. తిరిగి పోస్టాఫీస్ ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా రామచంద్రాపురంకు ఎంఎంటీఎస్ రైలు సర్వీస్‌లను పెంచాలని కోరారు. పట్టణంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, కేంద్ర ప్రభుత్వ నిధులతో భవనం నిర్మించే విధంగా కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఐలేష్ యాదవ్, సతీష్ పాల్గొన్నారు.

సాయుధ పోరాటం ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన సాయుధ రైతాంగ పోరాటం అందరికీ ఆదర్శంగా నిలిచిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, అధ్యక్షుడు నిరుడు సాయిలు అన్నారు. సోమవారం బెల్‌కాలనీలో నిర్వహించిన వారోత్సవాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరి విముక్తి కోసం ఈపోరాటాలు జరిగాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాజ్యం, లక్ష్మన్, బాబు, శంకరయ్య, శివ, మూర్తి, శంకర్‌లు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల పాత్ర గొప్పది



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సభ్యుడు నర్సింహ

జహీరాబాద్ టౌన్: రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టుల ప్రాత గొప్పదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈటి నర్సింహ అన్నారు. 76వ వార్షికోత్సవాల్లో భాగంగా పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాయుధ పోరాటాల వల్ల లక్షల భూములు పేదలకు దక్కాయన్నారు. నిజాం రాచరిక పాలన, భూస్వామ్య పెత్తందారుల ఆధిపత్యాలకు వ్యతిరేకంగా ప్రజలు పోరాటాలు చేశారన్నారు. ఎంతో మంది బలిదానాలతో గ్రామాల స్వరాజ్యాన్ని సాధించుకునామన్నారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ విముక్త పోరాటమే నిజమైన పోరాటమన్నారు. పేదలకు సాగు చేసుకుంటున్న భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలొద్దీన్, జహీరాబాద్ కార్యదర్శి నర్సింహులు, పూజ, ఆనంద్, చిరంజీవి, అశోక్, రాము, దత్తు రెడ్డి, ఆనంద్, సుధాకర్ విశ్వనాథ్ శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి షహబొద్దీన్ తుర్కి ఉర్సు



హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

జహీరాబాద్ టౌన్: శేఖాపూర్‌లోని హజరత్ షహబొద్దీన్ తుర్కీ ఉర్సు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. గంధం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఉత్సవాలకు హాజరుకావాలని నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే హరీశ్‌రావును సోమవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

రూ.4.26 లక్షలు పలికిన గణేష్ లడ్డూ



లడ్డూ దక్కించుకున్న సంగమేశ్వర్ గౌడ్

నారాయణఖేడ్: ఖేడ్ మండలం పంచగామలోని శ్రీనాగేశ్వర ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమను 10వ రోజైన సోమవారం నిమజ్జనం చేశారు. అంతకు ముందు వినాయకుడి లడ్డూకు వేలం వేశారు. కామారెడ్డి జిల్లా మాచాపూర్ గ్రామానికి చెందిన భక్తుడు రంగాసంగమేశ్వర్ గౌడ్ కుటుంబీకులతో వచ్చి అత్యధికంగా రూ.4.26 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. మాజీ సర్పంచి విఠల్‌రెడ్డితోపాటు గ్రామపెద్దలు లడ్డును అందజేశారు.

బీజేపీకి మాట్లాడే అర్హత లేదు



మాట్లాడుతున్న రాజయ్య

పటాన్‌చెరుటౌన్: బీజేపీకి సాయుధ రైతాంగ పోరాటం గురించి మాట్లాడే హక్కు లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని శ్రామిక్ భవన్‌లో సాయుధ రైతాంగా పోరాట వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ సాయుధ పోరాటాన్ని వక్రీకరించి దుర్మార్గమైన పద్ధతికి ఒడిగట్టిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాండు రంగారెడ్డి, అర్జున్, రాజు, విష్ణు, ఆంజనేయులు, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్, నరసింహరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఎంఆర్‌పీఎస్ మండల కార్యవర్గం ఇదే**

రాయికోడ్(అందోల్): రాయికోడ్ మండల ఎంఆర్‌పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా జంమ్గి గ్రామానికి చెందిన ఎం.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా రాయికోడ్‌కు చెందిన ఎస్.రాజ్‌కుమార్‌లు నియమితులయ్యారు. అదేవిధంగా అధికార ప్రతినిధిగా ఎ.మొగులయ్య, గౌరవ అధ్యక్షుడిగా ఎ.లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, నిరంజన్, కోశాధికారిగా ఎస్.సునీల్, కార్యదర్శులుగా కే.ఆనంద్, మోహన్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా శ్యామ్, సభ్యులుగా ప్రవీణ్, అనిల్, ఏసురత్నం, ఎం.ప్రవీణ్ తదితరులున్నారు.

◆ **నిత్యావసర సరుకుల పంపిణీ**



పటాన్‌చెరు టౌన్: మహ్మద్ ప్రవక్త బోధనలు మానవాళికి అనుసరణీయమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు మేరజ్‌ఖాన్ అన్నారు. మిలాద్ ఉన్‌నబీ సందర్భంగా మండలంలోని ఇస్నాపూర్‌లో సోమవారం మేరా ఇండియా సోషల్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అలాగే పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

◆ **నేడు ప్రజా పాలన**

మునిపల్లి(అందోల్): ఈనెల 17న తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఆశాజ్యోతి సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తన కార్యాలయంలో పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని కోరారు.

◆ **మాల మహానాడు నూతన కమిటీ**

జహీరాబాద్ టౌన్: మాల మహానాడు జహీరాబాద్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలో అంబేడ్కర్ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా దిలీప్ కుమార్(బుర్దిపాడ్), ప్రధాన కార్యదర్శిగా ధనరాజ్(వడ్డి), ఉపాధ్యక్షులుగా శివకుమార్(కల్బెమల్), కోశాధికారిగా రజనీకాంత్(శంశలపూర్), సలహాదారులుగా మొగులయ్యలు ఎన్నికయ్యారు. సమావేశంలో మాల మమానాడు జిల్లా అధ్యక్షులు మల్లేశం, ఉపాధ్యక్షులు దీపక్ ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని, మాలలు కలిసి రావాలని కోరారు.

◆ **పోరాట వారసులు కమ్యూనిస్టులు**

నారాయణఖేడ్: వెట్టి చాకిరి నుంచి ప్రజలను విముక్తి కల్పించింది తెలంగాణ సాయుధ పోరాటమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాణిక్ అన్నారు. సోమవారం ఖేడ్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం సాగిన మహోత్తర రైతాంగ పోరాటంలో అమరులను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నల్లవల్లి రమేశ్, సతీష్, అరుణ్, సంతోష్, కాన్షీరాం, పండరి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

◆ **నిమజ్జనానికి భారీ బందోబస్తు**



జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ డివిజన్‌లో మంగళవారం నిర్వహించనున్న వినాయకుల నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు 10 సెక్టార్లుగా విభజించామని, 130 మంది పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు చెప్పారు. 30 మందితో 8 మఫ్టీ బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జహీరాబాద్ సీఐ. శివలింగం, ఎస్ఐ. కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు పెరటికోళ్ల పంపిణీ**

నారాయణఖేడ్: ఖేడ్, మనూరు మండలాల్లోని పలు స్వయం సహాయక సంఘాల మహిళలకు మంగళవారం ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పెరటికోళ్లను పంపిణీ చేస్తారని ఆయా మండలాల ఐకేపీ ఏపీఎం వంశీకృష్ణ తెలిపారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు, మనూరులో మధ్యాహ్నం 1 గంటలకు పంపిణీ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

◆ **గీతం స్కాలర్‌కు డాక్టరేట్**

పటాన్‌చెరు: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని బండి శిరీష డాక్టరేట్ సాధించారు. 'ఫోటో ల్యూమిని సైన్స్ అధ్యయనాల కోసం రేర్ ఎర్త్ డోప్డ్ నానోఫాస్ఫార్ సంశ్లేషణ, లక్షణం' అనే అంశంపై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ డాక్టర్ ఫణి రాజా, డాక్టర్ పీసీ నాగేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈసందర్భంగా అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్‌రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పలువురు శిరీషను అభినందించారు.

◆ **అర్చకులకు గౌరవవేతనం చెల్లించండి**

నారాయణఖేడ్: గిరిజన తండాల్లోని భవానీమాత, సేవాలాల్ మహారాజ్ ఆలయాల అర్చకులకు దీప ధూపనైవేద్యపథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న గౌరవవేతనాలను చెల్లించాలని ఖేడ్ తాజా మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ కోరారు. సోమ వారం మాట్లాడుతూ మూడేళ్లగా గౌరవవేతనం చెల్లింపులు నిలిచిపోయాయని తెలి పారు. దీంతో అర్చకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి స్పందించి చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

◆ **నిమజ్జనానికి ఏర్పాట్లు**



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు గంగమ్మ ఒడికి చేరడానికి సిద్ధమయ్యాయి. నిమజ్జనానికి నారింజవాగుతో పాటు ఇతర చెరువుల వద్ద అధికారులు, ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.